క్లుప్తంగా

ఆంజనేయస్వామి ఆలయంలో చోరీ

వీరఘట్టం: మండలంలోని నీలానగరంలో గల ఆంజనేయస్వామి ఆలయంలో ఆదివారం అర్ధరాత్రి చోరీ జరిగింది. ఆలయ అర్చకుడు వెంకట కామేశ్వరరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్సై జి. కళాధర్ తెలిపారు. గుర్తు తెలియని వ్యక్తులు హుండీ పగులగొట్టి సుమారు ఏడు వేల రూపాయలు దొంగిలించుకుపోయారన్నారు.

సరస్వతీదేవి విగ్రహావిష్కరణ



సరస్వతీదేవి విగ్రహాన్ని ఆవిష్కరించిన దృశ్యం

గరుగుబిల్లి: మండలంలోని రావుపల్లి ప్రాథమిక పాఠశాల ఆవరణలో కొత్తగా ఏర్పాటు చేసిన సరస్వతీదేవి విగ్రహాన్ని సోమవారం ఆవిష్కరించారు. గ్రామానికి చెందిన బొంతాడ జగన్నాథరావు జ్ఞాపకార్థం బోను సత్యనారాయణ, విజయలక్ష్మిలు ఈ విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. ప్రధానోపాధ్యాయులు బొంతాడ జానకి మాట్లాడుతూ పాఠశాల ఆవరణలో చదువుల తల్లి సరస్వతీదేవి విగ్రహం ఏర్పాటుకు దాతలు ముందుకు రావడం ఎంతో అభినందనీయమన్నారు.

ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలి



వెలగవాడలో జరుగుతున్న చానల్ పనులు పరిశీలిస్తున్న ఎంపీడీఓ రంగారావు

పాలకొండ రూరల్: ఎండల తీవ్రత పెరుగుతున్నందున ఉపాధి పనులు జరుగుతున్న ప్రాంతాల్లో అవసరమైన ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని ఎంపీడీఓ వీవీ.రంగారావు అన్నారు. మండలంలోని వెలగవాడ, సిరికొండ, పరిసర గ్రామాల్లో సోమవారం ఆయన పర్యటించి, ఉపాధి పనులు పరిశీలించారు. ఈ సందర్భంగా వేతనదారుల హాజరు, మస్తర్లు, పనుల తాజా స్థితిగతులు, పెండింగ్ వేతనాలపై ఆరా తీశారు.

సీసీ కెమెరాల పనితీరుపై ఆరా



సీసీ కెమెరాల పనితీరును పరిశీలిస్తున్న పోలీసులు

పాలకొండ రూరల్: నేర పరిశోధనలో కీలకంగా మారుతున్న నిఘా నేత్రాల పనితీరుపై పట్టణ పోలీసులు ఆరా తీస్తున్నారు. పట్టణ ప్రధాన రహదారి, పోస్టాఫీస్ రోడ్డు జంక్షన్‌లో ఏర్పాటు చేసిన కెమెరాలతో పాటు కూరగాయల షాపులు, పలు దుకాణాల్లోని సీసీ కెమెరాలను ఎస్సై కె. ప్రయోగమూర్తి, తదితరులు సోమవారం పర్యవేక్షించారు. ఈ సందర్భంగా కెమెరాల ఆవశ్యకతను యజమానులకు వివరించారు.

సకాలంలో నిర్మాణాలు పూర్తి చేయాలి



తంపటాపల్లిలో లబ్ధిదారులతో మాట్లాడుతున్న హౌసింగ్ ఈఈ రవికుమార్

పాలకొండ రూరల్: గ్రామాల్లో ఇళ్ల నిర్మాణాలు చేపడుతున్న వారు త్వరితగతిన పూర్తి చేయాలని హౌసింగ్ ఈఈ రవికుమార్ అన్నారు. మండలంలోని తంపటాపల్లి, తుమరాడ, చింతాడ, తదితర గ్రామాల్లో సోమవారం ఆయన పర్యటించి గృహ లబ్ధిదారులతో మాట్లాడారు. నిర్మాణాల స్థాయిని అనుసరించి ఎప్పటికప్పుడు బిల్లులు అందించడంతో పాటు తమ సిబ్బంది సహకరిస్తారని సూచించారు. ఈయన వెంట ఏఈ బి.మాధవరావు, తదితరులున్నారు.

ఏజెన్సీలో జాతర సందడి



మండలో గ్రామదేవతకు పూజలు చేస్తున్న భక్తులు



తాడికొండలో జాతరకు తరలివచ్చిన గిరిజనులు

గుమ్మలక్ష్మీపురం: ఏజెన్సీలో జాతర సందడి నెలకొంది. ఏటా ఫిబ్రవరి నుంచి మే నెల వరకు ప్రతిరోజూ ఏదో గ్రామంలో జాతర జరుగుతూనే ఉంటుంది. ఇప్పుడు అదే వాతావరణం పలు గ్రామాల్లో కనిపిస్తోంది. ముఖ్యంగా తాడికొండ, మండ గ్రామాల్లో అయితే కొన్ని రోజులుగా జాతర అట్టహాసంగా జరుగుతోంది. ఆయా గ్రామాల ప్రజలు వారి గ్రామదేవతలకు విశేష పూజలు చేసి, మొక్కులు చెల్లించుకుంటున్నారు. అందరూ బాగుండాలని భగవంతుడిని ప్రార్థిస్తున్నారు. జాతర నేపథ్యంలో చేపడుతున్న పలు సాంస్కృతిక కార్యక్రమాలు ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి.

గడ్డి కుప్పలు దగ్ధం

పాలకొండ రూరల్: పశువుల దాణా నిమిత్తం పంట భూముల్లో నిల్వ ఉంచిన గడ్డి కుప్పలు సోమవారం జరిగిన అగ్ని ప్రమాదంలో కాలి బూడిదయ్యాయి. పాలకొండ – వీరఘట్టం రహదారిలో గజాలాఖానా సమీపంలో జి.గంగునాయుడు పొలంలో ఈ ప్రమాదం చోటుచేసుకుంది. విషయం తెలుసుకున్న అగ్నిమాపక అధికారి జామి సర్వేశ్వరరావు, సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని మంటలు ఆర్పారు.



మంటలను అదుపు చేస్తున్న అగ్నిమాపక సిబ్బంది

కంకర తవ్వకాలపై దాడులు

- జేసీబీ, ట్రాక్టర్ సీజ్

సాక్షి ఎఫెక్ట్...

వీరఘట్టం:

మండలంలోని రేగులపాడు – యు.వెంకమ్మపేట గ్రామాల సమీపంలో ఉన్న కొండ వద్ద కంకర అక్రమ తవ్వకాలు జరుగుతున్న వైనంపై ఈనెల 16న సాక్షిలో 'జోరుగా కంకర తవ్వకాలు' శీర్షికన ప్రచురితమైన కథనానికి మైనింగ్ అధికారులు స్పందించారు. ఈ మేరకు మైనింగ్ ఆర్ఐ షేక్ నూర్ అహ్మద్, టెక్నికల్ అసిస్టెంట్ సంతోష్, రేగులపాడు వీఆర్‌ఓ సాయిరాం తవ్వకాల ప్రాంతాన్ని సోమవారం పరిశీలించారు. ఆ సమయంలో జేసీబీతో కంకర తవ్వుతుండగా అడ్డుకున్నారు. కంకర తవ్వకాలకు అనుమతులు ఉన్నాయా అని జేసీబీ డ్రైవర్‌ను ప్రశ్నించగా.. ఎం.రాజపురం గ్రామానికి ఇటీవల నిర్మించిన బీటీ రహదారి బెర్మ్‌ల కోసం కంకర తరలిస్తున్నట్లు డ్రైవర్ సమాధానమిచ్చాడు. అయితే ప్రభుత్వ పనులకైనా, ప్రైవేట్ పనులకైనా మైనింగ్ అధికారుల అనుమతి తప్పనిసరిని చెబుతూ, డ్రైవర్ నుంచి స్టేట్‌మెంట్ నమోదు చేసుకున్నారు. అలాగే జేసీబీ, ట్రాక్టర్‌ను సీజ్ చేసి రెవెన్యూ అధికారుల సమక్షంలో పోలీసులకు అప్పగించారు.



జేసీబీ, కంకర తరలిస్తున్న ట్రాక్టర్ వివరాలు నమోదు చేస్తున్న మైనింగ్, రెవెన్యూ అధికారులు (ఇన్‌సెట్లో) ఈనెల 16న సాక్షిలో ప్రచురితమైన కథనం



జోరుగా కంకర తవ్వకాలు

కొండ వద్ద జేసీబీ సహాయంతో కంకర తవ్వకాలు

వీరఘట్టం: మండలంలోని యు.వెంకమ్మపేట – రేగులపాడు గ్రామాల సమీపంలో ఉన్న కొం

రూ.300 వేతనం గిట్టుబాటు అయ్యేలా పనులు

గరుగుబిల్లి: ఉపాధి హామీ పథకం పనుల్లో రోజుకు రూ.300 వేతనం గిట్టుబాటు అయ్యేలా పనులు చేపట్టాలని ఎంపీడీవో జి.పైడితల్లి సూచించారు. మండలంలోని పెద్దూరు, బీవీపురం గ్రామాల్లో జరుగుతున్న ఉపాధి పనులను ఆమె సోమవారం పరిశీలించి, పలు సూచనలు చేశారు. జాబ్‌కార్డు ఉన్న వారినే పనులకు అనుమతించాలని, పనిలో ఉన్న వారికే మస్తరు వేయాలని, పని ప్రదేశంలో తాగునీరు, టెంట్లు, ప్రథమ చికిత్స కిట్ ఉండేలా చూడాలన్నారు. నిర్దేశిత కొలతల ప్రకారం పనులు చేస్తే గిట్టుబాటు అయ్యే వేతనం లభిస్తుందన్నారు. ఆమె వెంట ఏపీవో గౌరీనాథ్ తదితరులు ఉన్నారు.



వేతనదారులకు సూచనలిస్తున్న ఎంపీడీవో పైడితల్లి

భూ సమస్యల పరిష్కారానికి రీ సర్వే

- జేసీ శోభిక

వీరఘట్టం: భూ సమస్యల పరిష్కారానికి రీ సర్వే చేపడుతున్నట్లు జాయింట్ కలెక్టర్ శోభిక అన్నారు. మండలంలోని తూడి గ్రామంలో జరుగుతున్న రీ సర్వే కార్యక్రమాన్ని సబ్ కలెక్టర్ యశ్వంత్‌కుమార్ రెడ్డితో కలిసి సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా సర్వే ఎలా చేపడుతున్నదీ అడిగి తెలుసుకున్నారు. ఇంతవరకు చేపట్టిన సర్వే వివరాలను సర్వే టీమ్ ఆన్‌లైన్‌లో నమోదు చేయడంతో ఆ వివరాలను జేసీ శోభిక లాప్‌టాప్‌లో పరిశీలించారు. రీ సర్వే వేగవంతంగా పూర్తి చేయాలని సర్వే బృందాలకు సూచించారు. అనంతరం రైతులతో మాట్లాడుతూ.. సర్వే సిబ్బందికి సహకరించాలని సూచించారు.



రీ సర్వే వివరాలను పరిశీలిస్తున్న జేసీ శోభిక, పక్కన సబ్ కలెక్టర్ యశ్వంత్‌కుమార్ రెడ్డి

నీటి ఎద్దడి తలెత్తకుండా చర్యలు

- డీఎల్‌పీఓ రామచంద్రప్రసాద్

వీరఘట్టం:

రానున్న వేసవిలో మండలంలో నీటి ఎద్దడి తలెత్తకుండా ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలని డీఎల్‌పీఓ జె. రామచంద్రప్రసాద్ అన్నారు. సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ వెంకటమరణ, ఈఓపీఆర్‌డీ, వీరఘట్టం మేజర్ పంచాయతీ ఈఓలతో మాట్లాడారు. ముఖ్యంగా అన్ని రక్షిత మంచినీటి ట్యాంకులను క్లీనింగ్ చేసి క్లోరినేషన్ చేయించాలని సూచించారు. అలాగే పారిశుధ్య పరిరక్షణకు పెద్దపీట వేయాలన్నారు. స్వర్ణాంధ్ర – స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా ప్లాస్టిక్ నియంత్రణపై ప్రజలకు అవగాహన కల్పించాలని, నిషేధిత ప్లాస్టిక్ కవర్లు, గ్లాసుల అమ్మకాలను అడ్డుకోవాలన్నారు. వీరఘట్టం మేజర్ పంచాయతీలోని వీధి కాల్వలపై ఉన్న అక్రమ నిర్మాణాలను తొలగించాలని సూచించారు. మూడు రోజుల్లో వీరఘట్టం ప్రధాన రహదారిలో ఉన్న మురుగు కాల్వలను శుభ్రం చేయిస్తామని ఈఓ రవి తెలిపారు. అలాగే గొడువీధితో పాటు బార్నాలవీధిల్లో ఆక్రమణలను తొలగించాలని డీఎల్‌పీఓ ఆదేశించారు.



మండల పరిషత్ కార్యాలయంలో అధికారులతో మాట్లాడుతున్న డీఎల్‌పీఓ రామచంద్రప్రసాద్

ఫార్మర్ రిజిస్ట్రేషన్ చేయించుకోవాలి

సీతానగరం: మండలంలోని రెవెన్యూ గ్రామాల భూముల్లో రైతులు సాగు చేస్తున్న పంటలను మానిటరింగ్ ఫార్మర్ రిజిస్ట్రేషన్లు చేయించుకోవాలని ఏఓ ఎస్.అవినాష్ అన్నారు. ఈ మేరకు మండలంలోని అంటిపేట రైతు సేవా కేంద్రం పరిధిలో ఉన్న వెంకటాపురం, అంటిపేట, వెన్నెల బుచ్చింపేట గ్రామాల్లో సోమవారం వ్యవసాయ సహాయకులు చేస్తున్న మానిటర్ ఫార్మర్ రిజిస్ట్రేషన్ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతు సేవా కేంద్రాల్లో వ్యవసాయ సిబ్బంది, వ్యవసాయసహాయకులు నిర్వహిస్తున్న ఫార్మర్ రిజిస్ట్రీ కార్యక్రమాన్ని వేగవంతం చేయాలని కోరారు. వ్యవసాయ సహాయకులకు అవసరమైన ఆధారాలను సమకూర్చి సహకరించాలని పిలుపునిచ్చారు.

పక్కాగా రికార్డుల నిర్వహణ ..

రెవెన్యూ రికార్డులు సక్రమంగా నిర్వహించాలని జేసీ శోభిక అన్నారు. సోమవారం స్థానిక మండల రెవెన్యూ కార్యాలయాన్ని ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా రికార్డులు పరిశీలించారు. మండలంలోని భూచంద్రిలో ప్రయోగాత్మకంగా చేస్తున్న రీసర్వే కార్యక్రమం పక్కాగా చేపట్టాలని సూచించారు. ప్రజా సమస్యల పరిష్కారానికి అధిక ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో ఐటీడీఏ పీఓ యశ్వంత్‌కుమార్ రెడ్డి, తహసీల్దార్ అప్పలరాజు, ఉప తహసీల్దార్ శ్రీవిద్య పాల్గొన్నారు. – సీతంపేట



గ్రామాల అభివృద్ధిలో ఎస్‌హెచ్‌జీల పాత్ర కీలకం

సీతంపేట: గ్రామాల అభివృద్ధిలో ఎస్‌హెచ్‌జీల పాత్ర కీలకమని జిల్లా పరిషత్ సీఈఓ ఎల్‌ఎస్‌వీ శ్రీధర్‌రాజు అన్నారు. సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా సిబ్బంది పనితీరు సమీక్షించారు. రికార్డుల నిర్వహణపై ఆరా తీశారు. వైటీసీలో ఇస్తున్న పీసా చట్టం శిక్షణను పరిశీలించారు.

మహిళా సంఘ సభ్యులు పథకాల అమలులో భాగస్వాములు కావాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ గీతాంజలి, పరిపాలనాధికారి మానస, శిక్షణ పర్యవేక్షకులు హనుమంతురావు, తదితరులు పాల్గొన్నారు.



శిక్షణలో మాట్లాడుతున్న సీఈఓ శ్రీధర్‌రాజు

ఫోర్టిఫైడ్ రైస్‌తో రక్త హీనత నివారణ

- ఐసీడీఎస్ పీఓ విజయలక్ష్మి

సాలూరు రూరల్: ఫోర్టిఫైడ్ రైస్‌తో గర్భిణుల్లో రక్తహీనత నివారించవచ్చని ఐసీడీఎస్ పీఓ విజయలక్ష్మి అన్నారు. ఈ మేరకు సోమవారం ఆమె మండలంలోని మామిడిపల్లి అంగన్‌వాడీ సెంటర్లో గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారంపై అవగాహన కల్పించారు. అలాగే ఫోర్టిఫైడ్ రైస్‌తో ఫుడ్ ఐటమ్స్ తయారు చేసే విధానాన్ని వివరించారు. అలాగే అందులో ఉండే ఫోలిక్ వల్ల గర్భిణులకు రక్తహీనత తగ్గుతుందని అంగన్‌వాడీ కేంద్రాల్లో ఇచ్చే ఫోర్టిఫైడ్ రైస్ గర్భిణులు, బాలింతలు మాత్రమే వినియోగించాలని సూచించారు. నార్మల్ రైస్ కడిగినప్పుడు అందులో తేలియాడే బియ్యం ఫోర్టిఫైడ్ రైస్ అని వాటిని పారేయకూడదని తెలిపారు. సీడీపీఓ చేతులతో గర్భిణులు, బాలింతలకు వండి పెట్టారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎస్‌డబ్ల్యూపీసీ నిర్మాణం పూర్తి చేయాలి

జియ్యమ్మవలస: మండలంలోని గెడ్డతిరువాడ గ్రామంలో నిర్మాణ దశలోని ఎస్‌డబ్ల్యూపీసీ(చెత్త నుంచి సంపద తయారీ కేంద్రం)ని ఎంపీడీవో ఎస్.రమేష్ సోమవారం సందర్శించారు. వారం రోజుల్లోగా నిర్మాణం పూర్తి చేయాలని సిబ్బందిని ఆదేశించారు. ఇంటింటి నుంచి సేకరించిన చెత్తను ఇక్కడి కేంద్రానికి తరలించి, వర్మీకంపోస్ట్ తయారు చేసి సబ్సిడీపై రైతులకు ఇవ్వాలని తద్వారా పంచాయతీకి అదనపు ఆదాయం సమకూరుతుందని సిబ్బందికి తెలిపారు. అంతకుముందు అదే గ్రామంలోని సచివాలయాన్ని సందర్శించి, సిబ్బంది పనితీరు, వారు చేస్తున్న సర్వేలపై సమీక్షించారు. 300 యూనిట్లు విద్యుత్ వినియోగం దాటిన వారి పేర్లు రిజిస్ట్రేషన్ చేయాలన్నారు.



ఎస్‌డబ్ల్యూపీసీ షెడ్డును పరిశీలిస్తున్న ఎంపీడీవో రమేష్

అభ్యసన సామర్థ్యాల పరిశీలన

జియ్యమ్మవలస:

మండలంలోని చినమేరంగి జేబీ పాఠశాలను ఎంఈఓ-1 జి.గౌరునాయుడు సోమవారం సందర్శించారు. పాఠశాల పరిసరాలతో పాటు రికార్డులు, ఉపాధ్యాయుల పనితీరు, విద్యార్థుల హాజరు పరిశీలించారు. అనంతరం తరగతుల వారీగా విద్యార్థుల వద్దకు వెళ్లి, తెలుగు, ఇంగ్లిష్, గణితం సబ్జెక్టులకు సంబంధించి పలు ప్రశ్నలు వేసి, వారి అభ్యసన సామర్థ్యాలను అంచనా వేశారు. చదువులో వెనకబడిన విద్యార్థుల విద్యా ప్రగతికి కృషి చేయాలని ప్రధానోపాధ్యాయుడు రంగయ్యకు సూచించారు. ప్రతిరోజూ విద్యార్థులంతా పాఠశాలకు హాజరయ్యేలా చూడాలని కోరారు.

గుమ్మలక్ష్మీపురం: మండలంలోని చింతలగూడ, చెముడుగూడ, కుక్కిడి తదితర గ్రామాల్లోని ఎయిడెడ్ పాఠశాలలను ఎంఈవోలు బి.చంద్రశేఖర్, బి.భీముడు సోమవారం సందర్శించారు. పాఠశాల రికార్డులతో పాటు పరిసరాలను పరిశీలించి పలు సూచనలు చేశారు. విద్యార్థులకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించాలని, మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనాలు పెట్టాలని, చదువులో వెనకబడిన విద్యార్థుల విద్యాప్రగతిపై దృష్టిసారించాలని తెలిపారు.



విద్యార్థులతో పుస్తకాలు చదివిస్తున్న ఎంఈవో గౌరునాయుడు



గుమ్మలక్ష్మీపురం: చింతలగూడ పాఠశాలను సందర్శించిన ఎంఈవోలు చంద్రశేఖర్, భీముడు

నిబంధనలు పాటించకుంటే చర్యలు

సాలూరు: మద్యం దుకాణాల్లో నిబంధనలు పాటించకుంటే చర్యలు తప్పవని ఎక్సైజ్ సీఐ దాసు హెచ్చరించారు. 'బ్రాండెడ్ మద్యం ఎక్కడ' అనే శీర్షికన సాక్షిలో ప్రచురితమైన వార్తపై ఆయన స్పందించారు.ఈ మేరకు సోమవారం పట్టణంలోని మద్యం షాపులను ఆకస్మికంగా తనిఖీ చేశారు. షాపుల్లో ఉన్న స్టాకు రికార్డులను పరిశీలించారు. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తే శాఖాపరంగా చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. మద్యం షాపుల్లో నిబంధనలు పాటించనట్లు గుర్తిస్తే వెంటనే అధికారులకు సమాచారం ఇవ్వాలని లేదంటే 14405 టోల్‌ఫ్రీ నంబరుకు కాల్ చేసి తెలియజేయాలని కోరారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచనున్నట్లు తెలిపారు.

కౌన్సిలర్లకు అభినందనలు

పాలకొండ: నగర పంచాయతీ కౌన్సిలర్లను మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాం అభినందించారు. పాలకొండలోని ఎమ్మెల్సీ విక్రాంత్ స్వగృహానికి సోమవారం సాయంత్రం వచ్చిన ఆయన పాలకొండ రాజకీయాలపై చర్చించారు. ఈ సమయంలో ఆయన్ను కలిసిన కౌన్సిలర్లతో మాట్లాడుతూ.. కౌన్సిలర్లు అంతా ఏకతాటిపై నిలిచి నగర పంచాయతీ చైర్మన్‌ను ఎన్నుకోవాలన్నారు. పాలకొండ కౌన్సిలర్లు పార్టీ కోసం, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సిద్ధాంతం కోసం నిలబడిన తీరు రాష్ట్ర స్థాయిలో నిలిచిందని తెలిపారు. ఆయనతో పాటు ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్, మాజీ ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి ఉన్నారు.



కౌన్సిలర్లతో మాట్లాడుతున్న మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాం

● సెలవు రోజు కూడా..



భామిని మండల రెవెన్యూ కార్యాలయంలో సిబ్బంది ఆదివారం కూడా విధులు నిర్వహించారు. సబ్ కలెక్టర్ యశ్వంత్‌కుమార్ రెడ్డి ఆదేశాల మేరకు రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన దరఖాస్తుల పరిష్కారంపై సిబ్బంది కార్యాచరణ రూపొందిస్తున్నారు. – భామిని

● శతశాతం ఫలితాలు సాధించాలి..



రానున్న పదో తరగతి పరీక్షల్లో శతశాతం ఫలితాలు సాధించేలా విద్యార్థులను సన్నద్ధం చేయాలని ఆర్‌జేడీ విజయభాస్కర్ అన్నారు. డీఈఓ ఎన్. తిరుపతినాయుడుతో కలిసి సోమవారం స్థానిక ఎంఆర్‌సీ ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎంలతో సమీక్ష నిర్వహించారు. గణితం, ఇంగ్లిష్, ఫిజిక్స్ సబ్జెక్ట్ టీచర్స్‌తో విద్యార్థుల సామర్థ్యాల గురించి అడిగి తెలుసుకున్నారు. వెనుకబడిన విద్యార్థులపై తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఈ సందర్భంగా వివరించారు. కార్యక్రమంలో డీవైఈఓ పి.కృష్ణమూర్తి, ఎంఈఓ కె.సోంబాబు, తదితరులున్నారు. – పాలకొండ రూరల్

● అంగన్‌వాడీ కార్యకర్తల ఆందోళన..

ఎన్నికల హామీలను అమలు చేయాలని కోరుతూ అంగన్‌వాడీ కార్యకర్తలు సోమవారం మధ్యాహ్నం స్థానిక ఐసీడీఎస్ కార్యాలయం వద్ద ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా యూనియన్ నాయకురాలు ఎన్.హిమప్రభ మాట్లాడుతూ.. సిబ్బందికి వేతనాలు పెంచి ఆదుకోవాలన్నారు. 11 రకాల మినిట్స్‌ను అమలు చేయాలని పలు మార్లు ముఖ్యమంత్రిని కలిసినా ప్రయోజనం లేకపోయిందని వాపోయారు. అనంతరం సీడీపీఓకు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు బి. అమరవేణి, జె. జెస్సీబాయ్ పాల్గొన్నారు. – పాలకొండ



సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
పాలకొండ / కురుపాం
9951602844, 9010204441
Office mail : vzmadvt@gmail.com